క్లుప్తంగా

బల్దియా ఆఫీసు ఎదుట సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక పరిధి 3వ డివిజన్ జంగాలపల్లిలోని ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్న 60 మంది నిరుపేదలకు ఇళ్ల నంబర్లు కేటాయించాలని సీపీఎం నాయకులు కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం వారు నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్(ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి మాట్లాడారు. రెండేళ్ల క్రితం భూపోరాటం ద్వారా 3వ డివిజన్ జంగాలపల్లిలోని ప్రభుత్వ స్థలంలో 60మంది పేదలు ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారన్నారు. వారందరికీ ఇంటి నంబర్లు లేకపోవడంతో కరెంట్, మంచినీరు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నాయకులు మండల రాజయ్య, మేకల దీప, మహేశ్వరి, సుజాత, బాలకృష్ణ, ఉషశ్రీ, రాజ్యలక్ష్మి, మంజుల, రామ, రజియా సుల్తానా పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ పట్నాలు


ముస్తాబైన ఎల్లమ్మతల్లి ఆలయం

ఎలిగేడు: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీరేణుకఎల్లమ్మ పట్నాల ఉత్సవాలు మండలంలోని ముప్పిరితోటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో 23 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షులు పూరెల్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రంగు కొమురయ్య తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 23న పోచమ్మ తల్లికి బోనాలు, 25న ఎల్లమ్మతల్లికి బోనాలు, 26న ఎల్లమ్మతల్లికి లగ్నపట్నం, నాగవెల్లి పట్నం, మొక్కుబడులు వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

'మంత్రిపై అసత్య ఆరోపణలు'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో సాధించని ప్రగతి కేవలం 15నెలల్లో కాంగ్రెస్ ప్రజాపాలనలో చేసి చూపించామని, కావాలనే మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంథని కాంగ్రెస్ నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెంద్రు రమాదేవి, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు జనగామ నరసింహారావు, కుడుదుల వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, ఆర్టీఏ మెంబర్ మంథని సురేశ్, నాయకులు గొటికరి కిషన్, అజీమ్‌ఖాన్, లింగయ్య పాల్గొన్నారు.

చీకురాయిలో స్వచ్ఛత, పరిశుభ్రత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామంలో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని వీధులన్నీ శుభ్రం చేశారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆవరణ శుభ్రంగా ఉంచుకున్నట్లు వీధులను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని కార్యదర్శి శంకరయ్య కోరారు.

అర్థరహిత ఆరోపణలు సరికాదు

ముత్తారం: మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అర్థరహిత ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. ముత్తారం కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ, నాయకులు తూటి రఫీ, గాదం శ్రీనివాస్, బియ్యని శివకుమార్, ఎడవేని సంపత్, లక్కం ప్రభాకర్, వజీద్‌పాషా పాల్గొన్నారు.


విసంపేట గ్రామంలో అసంపూర్తిగా జీపీ భవనం


నిర్మాణం పూర్తికాని మినీ ఫంక్షన్ హాల్

నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో?

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని విసంపేటలో అసంపూర్తి ప్రభుత్వ భవన నిర్మాణాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది పాలకవర్గం గడువు ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీ పక్కా భవనం, దీంతో పాటు మినీ ఫంక్షన్ హాల్, మహిళా భవనం డ్రైనేజీ నిర్మాణాలు నిధులు మంజూరు కాకపోవడంతో ఏడాదిగా సంబంధిత కాంట్రాక్టర్లు అసంపూర్తి దశలోనే పనులు నిలిపివేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో అసంపూర్తి దశలో ఉన్న మినీ ఫంక్షన్ హాల్‌లో పాఠశాల నిర్వహిస్తున్నారు. కాగా మహిళా భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. బర్పటి చిలుకయ్య ఇంటి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు నిర్మించతలపెట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు కందకం స్థాయిలోనే నిలిపివేశారు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తి దశలో ఉన్న భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అసంపూర్తి దశలో డ్రైనేజీ నిర్మాణం

కాంగ్రెస్ బలహీన వర్గాల కోసం పనిచేస్తుంది


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ధర్మారం: చట్టసభల్లో బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించడం హర్షనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్ అన్నారు. ధర్మారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు.

23న ప్రభుత్వ విప్‌కు స్వాగతం..
చట్టసభల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించిన తర్వాత మొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం తెలిపేందుకు 23న ఉదయం 10గంటలకు మండలంలోని పత్తిపాక క్రాస్‌రోడ్డు వద్దకు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కోరారు. పత్తిపాక క్రాస్ రోడ్డు నుంచి రాజారాంపల్లి ఎస్ఆర్ గార్డెన్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మార్కెట్ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, నాయకులు పోల్‌దాసరి సంతోష్ ఎదుల్ల అంజయ్య, వీర్‌పాల్, మల్లేశం పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝూ

గోదావరిఖని: మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కె.నాగరాజు గుండెపోటుతో మరణించాడు. కాగా అతడి కుటుంబానికి శనివారం భద్రత చెక్కును రామగుండం సీపీ అంబర్‌కిషోర్ ఝూ అందజేశారు. సీపీ కార్యాలయంలోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడి భార్య విజయకుమారికి రూ.7.84లక్షల విలువ గల చెక్కు అందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంధ్య, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు పోచలింగం పాల్గొన్నారు.

కల్యాణానికి ముస్తాబైన పుట్ట నాగమల్లేశ్వరస్వామి ఆలయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలోని శ్రీపుట్ట నాగమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఒగ్గు పూజారులు మల్లన్న పెద్దపట్నం, కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



రైతులకు న్యాయం చేయండి


పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ కోరారు. మండలంలోని చీకురాయి, భోజన్నపేట తదితర గ్రామాల్లో నష్టపోయిన పంటలను శనివారం ఆయన బీజేపీ నేతలతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. నాయకులు మేకల శ్రీనివాస్, రాజం మహంత, తిరుపతి, రాజేంద్రప్రసాద్, సతీశ్, ఉమేశ్, రాజేశ్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఎలిగేడు: గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ కోరారు. మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్ అధ్యక్షతన మండల కేంద్రంలో శనివారం యూనియన్ సమావేశం జరిగింది. వేతనాల విడుదల కోసం ధర్నా చేస్తే ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తోందని వాపోయారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఎంపీడీవో భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం 25న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి జీపీ ఉద్యోగ, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, నాయకులు కవ్వంపల్లి దేవేందర్, పంగ భాస్కర్, రాయపాక లక్ష్మన్, చెవుల రమేశ్, గొల్లె మల్లేశ్, తీట్ల ప్రేమ్‌కుమార్, ఆసంపల్లి చంద్రయ్య, రవీందర్ పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల నిరసన


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అంటూ ప్రచారం చేసుకుంటూనే కార్మికుల సమస్యలను ప్రభుత్వానికి వినకుండా ముందస్తుగా అరెస్టు చేయడమేంటని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి ప్రశ్నించారు. పెద్దపల్లిలోని కమాన్ చౌరస్తా వద్ద శనివారం సీఐటీయూ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌కు వెళ్లకుండా అక్రమ అరెస్టులకు పాల్పడడం సరికాదన్నారు. నాయకులు బొంకూరి సాగర్, స్వప్న, బడుగు శ్రీనివాస్, రాజేశ్, రాజేశ్వరి ఉన్నారు.

కలప పట్టివేత
గోదావరిఖని: ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-11 గని వెనకాల పెద్దంపేట్ గ్రామ సమీపంలో సింగరేణి చెట్లను నరికి తరలిస్తుండగా శనివారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. చెట్లను నరికి ట్రాలీ ఆటోలో దొంగతనంగా తీసుకెళ్తున్నారని సెక్యూరిటీ అధికారి వీరారెడ్డికి అందిన సమాచారం మేరకు జూనియర్ ఇన్‌స్పెక్టర్ అక్బర్‌అలీ నేతృత్వంలో సెక్యూరిటీ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సుభాబుల్ చెట్లను నరికి లోడ్ చేసి ఉన్న ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకుని జీఎం కార్యాలయానికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

• కంటి అద్దాల పంపిణీ
యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్-3 సింగరేణి పాఠశాల విద్యార్థులకు శనివారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని 5 నుంచి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వైద్య నిపుణులతో ఉచితంగా కంటి పరీక్షలు చేసి దృష్టి లోపం కలిగిన వారికి అద్దాలు అందజేశారు. అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

• మద్యం మత్తులో యువకుడి హల్‌చల్
పాలకుర్తి: మద్యం మత్తులో యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన బసంత్‌నగర్‌లో జరిగింది. పోలీసుల వివరాలు.. బసంత్‌నగర్‌కు చెందిన సార్ల నరేశ్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యం మత్తులో స్థానిక లారీ అసోషియేషన్ నాయకులు, సభ్యులను దుర్భాషలాడాడు. దీంతో వారు కొద్దిరోజులుగా నరేశ్‌ను విధులకు అనుమతించడం లేదు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి నరేశ్ స్థానిక సిమెంట్ కర్మాగారం లారీయార్డు సమీపంలోని హైమాస్ట్ లైట్లకు సంబంధించిన స్తంభం ఎక్కి తనను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి ఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

• అకాల వర్షానికి నేలవాలిన వరి
కమాన్‌పూర్: మండలంలోని శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి పంటలు నేలవాలాయి. గొలుసు, పొట్ట దశలో ఉన్న వరి పొలాలు నేలవాలడంతో పంట దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

• రెండోరోజు ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు
ఓదెల: మండలంలో పదో తరగతి పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఓదెల, కొలనూర్, పొత్కపల్లి సెంటర్లలో 313 మంది విద్యార్థులు శనివారం హిందీ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష సెంటర్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

• వాహనాల తనిఖీ
ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తి, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

• గాయత్రీ కాలేజీలో వ్యాసరచన పోటీలు
పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ కాలేజీలో శనివారం ప్రపంచ జలదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపాల్ రవీందర్ బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు నెహ్రూ యువకేంద్రం వలంటీర్ మహేశ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలు జయప్రదం చేయండి

రామగుండం: భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలు జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు ఆనంద్ కోరారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి 30 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మేర్గు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, పైడిపల్లి రమేశ్, ఆరుముళ్ల తిరుపతి, గొట్టె శంకర్, కల్వల మహేందర్, కోడిపుంజుల పోచయ్య, లక్ష్మణ్, రాములు తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవైఎల్ ప్రతినిధులు

రామగుండం పీఎస్‌లో తాగునీటి ఇక్కట్లకు చెక్

రామగుండం: రామగుండం పోలీస్‌స్టేషన్‌లో తాగునీటితో పాటు ఇతర అవసరాలకు కుళాయి లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రామగుండం సీఐ తంగళ్లపల్లి ప్రవీణ్‌కుమార్ సొంత ఖర్చులతో శనివారం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బోర్‌వెల్ వేయించారు. సీఐ, రామగుండం ఎస్సై గుండేటి సంధ్యారాణి ప్రత్యేక పూజలు చేసి బోర్‌వెల్ వేయించారు.



సింగరేణి వార్తలు

బాధ్యతగా విధులు నిర్వహించాలి


నియామక పత్రం అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని, విధులకు గైర్హాజరు కావొద్దని, బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్వాలిడేషన్, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించి 15మంది కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ స్థాయికి తగ్గట్టుగా పనిచేస్తూ సూపర్‌వైజర్ల ఆదేశాలు పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సంస్థ అభివృద్ధికి తోడ్పాడలన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, సీనియర్ అసిస్టెంట్ శిరీష పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి


మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. జీడీకే-1, 3, సీఎస్పీ-1లో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యజమాన్యం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. యాజమాన్యం సింగరేణి స్కూళ్లను ఆధునీకరిస్తామని సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెడతామని చెప్పి ఇప్పటివరకు ప్రవేశపెట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. 2025లో స్కూళ్లన్నీ ఆధునీకరించి సీబీఎస్ఈ సిలబస్‌తో ప్రారంభించాలని కోరారు. సింగరేణి హాస్పిటల్‌ను ఆధునీకరిస్తామని చెప్పిన యజమాన్యం ప్రకటనలకే పరిమితమవుతూ కాలయాపన చేస్తోందన్నారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, తోట నరహరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, దాసరి సురేశ్, తుమ్మల కృష్ణారెడ్డి, రమేశ్, జలగం సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

నేత్ర, శరీర అవయవదానంపై అవగాహన


దోనర్ కార్డులతో సింగరేణి ట్రైనింగ్ ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీ ఒక్కరు నేత్ర, శరీర అవయదానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి పిలుపునిచ్చారు. ఆర్జీ-2 ఏరియా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నేత్ర, శరీర, అవయవ దానాలపై శిక్షణ తీసుకుంటున్న సింగరేణి యువ కార్మికులకు, ఉద్యోగులకు శనివారం అవగాహన కల్పించారు. మానవ శరీరంలోని ఎంతో విలువైన అవయవాలు మనిషి మరణించిన తర్వాత మట్టిలో కలిసిపోకుండా సమాజహితం కోసం దానం చేయాలని సూచించారు. ట్రైనింగ్ సెంటర్ డీవైజీఎం జీసీఎం విజయ్ కుమార్‌తోపాటు 30మంది యువ సింగరేణి ఉద్యోగులు నేత్రదానానికి ముందుకు రాగా వారికి సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు డోనర్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలి


మాట్లాడుతున్న విశ్వనాథ్

గోదావరిఖని: అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు కె.విశ్వనాథ్ అన్నారు. స్థానిక తిలక్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. అరెస్టు చేసిన నాయకులు వరదయ్య, ఇతర ప్రజా సంఘాల, పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాల డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అరెల్లి క్రిష్ణ, సురేందర్, భాస్కర్‌రెడ్డి, లింగయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దేశానికి నేటి యువతే చుక్కాని



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: దేశానికి నేటి యువతే చుక్కాని అని మంచిర్యాల ఆర్డీవో, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ గూడూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 మెగా ఈవెంట్ రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువ పార్లమెంట్ నోడల్ అధికారి ఎ.సాంబశివరావు, ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజ, ప్రత్యేక పరిశీలకులుగా లక్ష్మీనర్సయ్య, అనంతుల సతీశ్, స్టాఫ్ సెక్రటరీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఎం.నరేశ్, డి.కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ బి.తిరుపతి, శారద, శంకరయ్య, అజయ్‌కుమార్, శ్రీదేవి, స్రవంతి, సమత, రామకృష్ణ, సురేశ్, రవీందర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పూసాల రైస్‌మిల్ అసోసియేషన్ సమీపంలో కార్మికులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు మాట్లాడారు. అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశామని తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ అంజయ్య, వివిధ సంఘాల నాయకులు రాజమల్లు, బ్రహ్మచారి, సంపత్, స్వామి, మొండయ్య, తిరుపతి, కిరణ్, సతీశ్, శ్రీనివాస్, పర్వతాలు, నారాయణ, లక్ష్మీరాజం, ప్రణయ్, రాజు, రాజేశ్, విలాస్, దుర్గ మహేందర్, ప్రభాకర్, సంపత్, కుమార్, ప్రేమ్, రవి, మనోహర్, మల్లేశ్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్


సదస్సులో అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వారం రోజుల నుంచి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరేశ్ వారంరోజుల నుంచి విద్యార్థులు చేపట్టిన మొక్కలు నాటడం, కిచెన్, గార్డెన్, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధం వంటి తదితర కార్యక్రమాలపై వెంకట్రావుపల్లి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, ఎంఈవో కొమురయ్య బహుమతులు అందజేశారు.

మైనింగ్ సర్దార్‌కు గాయాలు
గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ-1 పరిధి జీడీకే-11గనిలో మైనింగ్ సర్దార్‌కు గాయాలయ్యాయి. గనిలోని కంటిన్యూస్ మైనర్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో మైనింగ్ సర్దార్ రవితేజ తలపై బొగ్గు పెళ్ల పడడంతో గాయాలయ్యాయి. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదాన్ని అధికారులు గోప్యంగా ఉంచడం సరికాదని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు.